క్లుప్తంగా

అంకమ్మతల్లికి కుంకుమార్చనలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి విశేషంగా పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి సమర్పించిన, అలంకరించిన చీరలను వేలం వేశారు. భక్తులు అమ్మవారి చీరలను వేలంలో దక్కించుకున్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురం ఫుల్ గాస్పల్ చర్చిలో ఆదివారం నూతన సంవత్సరం క్యాలెండర్‌ను రెవరెండ్ డాక్టర్ డానియేల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫుల్ గాస్పల్ చర్చిలో ప్రార్థనలు నెల రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంఘస్తులందరికీ ఉచితంగా నూతన సంవత్సరం క్యాలెండర్‌తో పాటు ప్రభువు ఆశీస్సులు అందజేస్తామని తెలిపారు. సంఘస్తులు విశ్వాసకులు ఈ సదవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెద్ద సంఖ్యలో విశ్వాసకులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

నగర శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం

సుదర్శనరావు, వెంకటేశ్వరరావు ప్యానల్ విజయం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల నగర శాఖ నూతన కమిటీ ఎన్నికైంది. ఎన్నికల్లో సుదర్శనరావు – వెంకటేశ్వరరావు ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఆదివారం ఏపీ ఎన్జీఓ భవన్‌లో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగరశాఖ అధ్యక్షుడుగా జి.సుదర్శనరావు, కార్యదర్శిగా ఎస్. వెంకటేశ్వరరావు, సహాధ్యక్షుడుగా ఎస్.రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా పి.వెంకటేశ్వర్లు, జాయింట్ ఎం.వి.ఎస్.కె.కృష్ణ శ్యామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆర్. నాగేశ్వరరావు కోశాధికారిగా జె.తిరుపతిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా టి. శ్రీనివాసరావు వ్యవహరించారు. సమావేశంలో ఏపీఎన్జీవో జిల్లా కోశాధికారి బి.సతీష్ కుమార్, 4వ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.చంద్రశేఖరరావు, కె.వై.యం.మాణిక్యాలరావు , జిల్లా అధ్యక్షులు ఎ.ఆదినారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరి ఏవీ. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీఎంసీలో నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగర వాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలన్నారు.

ఓటరు నమోదు కేంద్రాలకు విశేష స్పందన



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఓటరు నమోదు, మార్పులు చేర్పుల కోసం ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలకు విశేష స్పందన లభించింది. ఓటర్లు వారి ఓట్లను సరిచూసుకోవటంతో పాటు 18 సంవత్సరాలు నిండిన వారి ఓట్లు నమోదుకు దరఖాస్తులు సమర్పించారు. అలాగే ఇళ్లు మారిన వారు తమ చిరునామాలను అప్‌డేట్ చేయించుకున్నారు. ఓటరు నమోదు కేంద్రం సిబ్బంది తగు సూచనలు సలహాలు అందజేశారు.









సండే సందడి..



విజయవాడ భవానీపురం భవానీ ద్వీపంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. వివిధ ప్రదేశాల నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. కార్తికమాసం సందర్భంగా వన భోజనాలు ఏర్పాటుచేసుకొని కోలాహలంగా గడిపారు. చిన్నారులు, మహిళలు ఆటలాడుతూ ఆనందంగా ఉన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ద్వీపంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



మధుమేహంపై మరింత అప్రమత్తత అవసరం



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ సదాశివరావు తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రోజు రోజుకు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్న మధుమేహం పట్ల మరింత అప్రమత్తత అవసరమని పలువురు నిపుణులు పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ శాఖ, వైడీఆర్ఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో మధుమేహం, ఎండోక్రైనాలజీ విభాగాలకు సంబంధించి సదస్సు జరిగింది. ఈ సదస్సులో పలువురు నిపుణులు పాల్గొని మధుమేహంతో పొంచి ఉన్న విపత్తు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, అదుపులో ఉంచుకునేందుకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక మందులు, చికిత్సా విధానాలు వంటి వాటిని విశ్లేషణాత్మకంగా వివరించారు. మన దేశంలో ప్రీ డయాబెటీస్ ఆందోళన కరస్థాయిలో పెరిగిపోతుందన్నారు. ఈ సదస్సులో నగరానికి చెందిన మధుమేహ నిపుణులు డాక్టర్ వై.సదాశివరావు కీలక ఉపన్యాసం చేయగా, దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 25 మంది నిపుణులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ నగర శాఖ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ప్రమోద్, వైద్యులు శివరామ్, హిమన, ఐశ్వర్య, అమూల్య పాల్గొన్నారు.

వ్యాయామంతో శారీరక ఆరోగ్యం



ఎంజీ రోడ్డులో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఏడీసీపీ లక్ష్మీపతి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి రోజూ వ్యాయామం చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా జీవించవచ్చునని స్పెషల్ బ్రాంచ్ అదనపు డీసీపీ లక్ష్మీపతి అన్నారు. ప్రతి రోజూ స్విమ్మింగ్, నడక, సైక్లింగ్ వంటి వాటిలో ఏదోకటి చేయాలని ఆయన సూచించారు. ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సిల్వర్ జూబ్లీ రైడ్‌ను ఆదివారం నగరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరావతి రన్నర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఎంజీ రోడ్డులో ఏడీసీపీ లక్ష్మీపతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎంజీ రోడ్డులో డీవీ మానర్ హోటల్, బెంజిసర్కిల్ మీదుగా ఏలూరు రోడ్డు, పోలీస్‌కంట్రోల్‌రూమ్, ప్రకాశం బ్యారేజ్ మీదుగా కరకట్ట వద్ద ఉన్న ఆక్వా డెవిల్స్ వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవితానికి మంచి ఆహారపు అలవాట్లతో పాటు, వ్యాయామం కూడా అవసరమన్నారు. ఆరోగ్యం పట్ల ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు స్విమ్మింగ్, సైక్లింగ్‌పై అవగాహన కల్పించేందుకు ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. అంతేగాక కరోనా సమయంలో, వరదలు వచ్చినప్పుడు తమ వంతు సహాయ సహకారాలు అందించారని కొనియాడారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల కిందట ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం రెండు వేల మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఈ నెల 9, 10 తేదీల్లో సిల్వర్ జూబ్లీ వేడుకలు వైభవంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెలగపూడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధనలతో సమైక్యత

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



బ్రాహ్మణ వన సమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

విజయవాడరూరల్: కార్తిక వన సమారాధనలు సమైక్యతకు, స్నేహాభిమానాలు పెంచుకునేందుకు ఎంతగానో దోహదం చేస్తాయని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలో ఆదివారం రాజుగారి మామిడితోటలో బ్రాహ్మణ కార్తిక వన సమారాధన సందడిగా జరిగింది. బ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతీయ సంప్రదాయంలో వన విహారానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. యాంత్రిక జీవనంలో కార్తికమాసం కొత్త శోభను తీసుకువస్తుందని, ఆత్మీయులందరూ ఒక చోట చేరడం వల్ల బంధాలు, బాంధవ్యాలు బలపడతాయన్నారు. ఇలా అందరూ ఒక వేదికగా కలుసుకుంటూ ముందుకు సాగడం గొప్ప విషయమన్నారు. బ్రాహ్మణులంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపార గౌరవమని తెలిపారు. సనాతన హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ఈ ప్రభుత్వంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ధర్మప్రచార పరిషత్‌ను ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కరోనా కష్టకాలంలో పేద అర్చకులకు రూ. 5వేలు చొప్పున ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, కొప్పవరపు బలరామకృష్ణమూర్తి, నిడుమోలు రామాసత్యనారాయణ, దమ్మాలపాటి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కృష్ణా తరంగ్‌లో నలంద ఆల్‌రౌండ్ చాంపియన్



కృష్ణతరంగ్‌లో ఆల్‌రౌండ్ చాంపియన్స్‌గా నిలిచిన నలంద విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మచిలీపట్నంలోని కృష్ణా విశ్వ విద్యాలయంలో నవంబర్ 30 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు నిర్వహించిన కృష్ణతరంగ్ – 2023లో తమ విద్యార్థులు ఆల్‌రౌండ్ చాంపియన్స్‌గా నిలిచారని నగరంలోని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. తమ విద్యార్థులు 13 విభాగాల్లో బహుమతులు సాధించారన్నారు. వెస్ట్రన్ గ్రూప్ సింగింగ్, డిబేట్, మైమ్, వన్ యాక్ట్ ప్లే, స్కిట్, స్పాట్ ఫొటోగ్రఫీ, వెస్ట్రన్ ఇన్‌స్ట్రుమెంటల్, ఫోక్ డ్యాన్స్, ఇన్‌స్టాలేషన్, మెహందీ, ఫోక్, ఆర్కెస్ట్రా, గ్రూప్ ఇండియన్ సింగింగ్, వెస్ట్రన్ సోలో సింగింగ్‌లలో బహుమతులు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా విజేతలను నలంద విద్యా సంస్థల చైర్మన్ ఎ.విజయబాబు, అధ్యాపకులు అభినందించారు.

కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



భవానీపురం(విజయవాడపశ్చిమ): కేంద్రంలోని బీజేపీ మత రాజకీయాలు చేస్తుందని, దేశంలో లౌకికత్వం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు పార్టీ బలంగా ఉండాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. విద్యాధరపురం చెరువు సెంటర్‌లోని సీపీఐ కార్యాలయం ఉప్పలపాటి సుబ్బరాజు భవన్‌లో ఆదివారం జరిగిన పార్టీ సభ్యత్వ పునఃరుద్ధరణ, నూతన సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. సీపీఐ శత వార్షికోత్సవాలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు రెట్టించిన ఉత్సాహంతో పని చేయాలన్నారు. అనంతరం పార్టీలో కొత్తగా సభ్యత్వం తీసుకున్న వారికి గుర్తింపు కార్డులు అందజేశారు. సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, జి.ఈశ్వరయ్య, లంక దుర్గారావు, తాడి పైడయ్య, పంచదార్ల దుర్గాంబ, బుద్దే రాజా, యు.శివప్రసాదరాజు, టి.పూర్ణయ్య, వై.జోసెఫ్, కొట్టు రమణారావు పాల్గొన్నారు.

గాయనీ గాయకులు పోటీతత్వం అలవాటు చేసుకోవాలి



విజయవాడ కల్చరల్: గాయనీ గాయకులు పోటీ తత్వం అలవాటు చేసుకోవాలని శ్రీధర్ ఈవెంట్స్ వ్యవస్థాపకుడు గెద్దం మంగరాజు అన్నారు. సినీ సంగీత దర్శకుడు ఘంటసాల 101 జయంతి సందర్భంగా గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికమీద ఆదివారం జిల్లా స్థాయి ఘంటసాల పాటలపోటీలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. మంగరాజు మాట్లాడుతూ గాయనీ గాయకుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చిట్టిబాబు నిర్వాహకుల కృషిని అభినందించారు. 30 మంది పాల్గొన్నారు. సీనియర్ విభాగంలో శివకుమారి, వెంకట్, సుకన్యలకు ప్రథమ ద్వితీయ బహుమతులు అందజేశారు.

వాహనాలకు బహిరంగ వేలం

ఉయ్యూరు: అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఉయ్యూరు ఎస్ఈబీ సీఐ ఎంఏ ఖదీర్ ఆదివారం తెలిపారు. ఎస్ఈబీ డెప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 7న మధ్యాహ్నం 2 గంటలకు ఉయ్యూరు ఎస్ఈబీ కార్యాలయం వద్ద రెండు వాహనాలు బజాజ్‌పల్సర్, మారుతీ 800 కారుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9440902451, 9959036522 నంబర్లను సంప్రదించాలని కోరారు.

తెలుగువారి గుండె చప్పుడు ఘంటసాల



గాయనీ గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: తెలుగు వారి గుండె చప్పుడు ఘంటసాల వెంకటేశ్వరరావు అని ఆశిష్ ఈవెంట్స్ సంస్థ వ్యవస్థాపకురాలు సత్యస్వాతి అన్నారు. గాంధీనగర్‌లోని నూతన కళావేదికమీద ఆదివారం ఘంటసాల 101 జయంతి, రాగలహరి, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. సత్యస్వాతి మాట్లాడుతూ పాటను భావరాగయుక్తంగా ఆలపించడంలో ఘంటసాలను మించిన వారు లేరన్నారు. గాయకుడు తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఘంటసాల స్వరాన్ని నేటి తరం గాయనీ గాయకులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చింతకాయల చిట్టిబాబు, బండారు నరసింహరావు, నితీష్, వాసలి శ్రీనివాస్, నరేష్, మల్లీశ్వరి, డేవిడ్‌రాజు తదితరులు ఘంటసాల గానం చేసిన గీతాలు 12 గంటలపాటు ఆలపించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గాయనీ గాయకులు వంద మందికి పైగా పాల్గొన్నారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, శీతాకాలం చల్లగాలిలో రక్షణ పద్ధతులు పాటించకుండా తిరగకూడదని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఆదిత్య చంద్రభట్ల అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్‌ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకీ అధ్యక్షతన ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వృద్ధులు ఆస్తమా వ్యాధి గ్రస్తులు చల్లగాలి తగలకుండా చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రాత్రిపూట, తెల్లవారుజాము ప్రయాణాలు తగ్గించుకోవాలని తెలిపారు. తుఫాను ప్రభావం వల్ల వర్షాలు పడే అవకాశం ఉన్న దృష్ట్యా కాచి చల్లార్చిన నీటినే తాగాలని తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యనిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం మాట్లాడుతూ ఇంట్లో దోమల నివారణకు కాయిల్స్ వినియోగించటం వల్ల శ్వాస కోశ సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున దోమల నివారణకు కాయిల్స్ కాకుండా దోమతెరలు, దోమల బ్యాట్‌లు వినియోగించాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి మాట్లాడుతూ ట్రస్ట్ సేవలను సద్వినియోగంచేసుకుని ఆరోగ్యకర జీవనంసాగించాలని అన్నారు. అనంతరం సుమారు 300 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ డెప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ కనకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీలోని కానుకల చోరీ

వన్‌టౌన్: పాతబస్తీ బ్రాహ్మణవీధిలో కొలువై ఉన వెంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీలోని కానుకలు చోరీకి గురయ్యాయి. పరిచారకునిగా పని చేస్తున్న పరాశరం ముకుంద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పరాశరం ముకుంద్ శనివారం రాత్రి 9.30 గంటల సమయంలో ఆలయంలోని హనుమంతుని ఉపాలయానికి తాళం వేసి ఇంటికి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం 5.30 గంటలకు వచ్చి ఉపాలయం తలుపు తెరిచి లోపల శుభ్రం చేసి బయటకు వస్తుండగా కింద చిల్లర నాణేలు కనిపించాయి. వాటిని పరిశీలిస్తూ అక్కడే ఉన్న స్టీల్ హుండీ వైపు చూడగా దాని తాళాన్ని కోసి ఉన్నట్లు గుర్తించారు. కానుకలను పరిశీలించగా అవి పూర్తిగా ఎవరో దొంగిలించినట్లు గ్రహించాడు. ప్రధాన అర్చకులు శ్రీరామచంద్రమూర్తికి, అలాగే ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి సామూహిక సత్యనారాయణ వ్రతాలు



శివలింగ ఆకారంలో వెలుగుతున్న దీపాలు



కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో సామూహిక వ్రతాలు చేస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీక మాసం పురస్కరించుకుని ఆదివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. కార్తీక మాసంలో సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరించటం వల్ల స్వామివారి ఆశీస్సులు లభిస్తాయని భక్తుల విశ్వాసం. ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యాన సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు సామూహిక సత్యనారాయస్వామి వ్రతాలలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కార్తీక మాసంలో సత్యనారాయణస్వామివ్రతం విశిష్టతను వివరించారు. సుమారు 130 దంపతులు వ్రతాలలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నవరం నుంచి తీసుకొచ్చిన స్వామివారి ప్రసాదంను భక్తులకు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం దీపోత్సవం జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు డీవీఎస్ రాజు, కార్యదర్శి డీ శివరామరాజు, ఐఎస్ఎన్ రాజు పర్యవేక్షించారు. ఆంధ్రాషిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో ఆదివారం కార్తీక మాసోత్సవాలలో భాగంగా సామూహిక సత్యనారాయ స్వామి వ్రతాలు జరిగాయి. ఆలయ అర్చకులు వ్రతాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసి ఉన్న శ్రీ కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో నిర్వహిస్తున్న కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సామూహిక వ్రత కార్యక్రమంలో 150 మంది దంపతులు పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి వ్రత మాచరించారు. వ్రతం అనంతరం సత్యనారాయణ స్వామి, తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి వార్ల ప్రసాదాలు పంపిణీ చేశారు. 600 మందికి అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబశివరావు మాట్లాడుతూ గొట్టాపు అనిల్ కుమార్, అన్నపూర్ణ దంపతుల సౌజన్యంతో సామూహిక వ్రతాలు జరిగాయన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఆలయ ధర్మకర్తలు, పెద్దలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల పంపిణీ



గన్నవరం: క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేస్తే క్రీడల్లో రాణించవచ్చని హ్యాండ్‌బాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరివీధి వెంకయ్య పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు పోలీస్ శాఖకు చెందిన తుపాకుల ఆంజనేయులు సౌజన్యంతో టీషర్టులను ఆదివారం పంపిణీ చేశారు. వెంకయ్య మాట్లాడుతూ తెనాలిలో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు సిద్ధమవుతున్నారని తెలిపారు. క్రీడాకారులకు టీషర్టులను బహూకరించిన దాతలను ఆయన అభినందించారు. వ్యాయామోపాధ్యాయుడు ధనియాల నాగరాజు, సీనియర్ క్రీడాకారుడు రాజేంద్ర పాల్గొన్నారు.